క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళం



నగదు అందజేస్తున్న దాతలు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున స్వామి సమేత కామాక్షి తాయి అమ్మవారి ఆలయంలో భక్తులకు నిత్యాన్నదానం చేసేందుకు దాతలు శుక్రవారం విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన గుబ్బా వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులు అన్నదాన పథకానికి రూ.51,116 నగదును ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా దాతలను స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో అర్చకులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వాహనాల స్వాధీనం



వాహనం వద్ద మత్స్యశాఖ అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం: చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న మూడు వాహనాలను మత్స్య శాఖ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీఓ పొట్టయ్య కథనం మేరకు.. మండలంలోని కాగులపాడు గ్రామ సమీపంలో ఉన్న రొయ్యల గుంతలకు చికెన్ వ్యర్థాలు తరలిస్తున్నట్లు గ్రామస్తులు అధికారులకు సమాచారం అందించారు. దీంతో వారు సిబ్బందితో కలిసి వెళ్లి దాడులు చేశారు. రెండు బొలెరో వాహనాల్లో 24 డబ్బాల్లో చికెన్ వ్యర్థాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మరో మినీలారీలో ఖాళీగా డబ్బాలను గుర్తించారు. అధికారులు మాట్లాడుతూ చికెన్ వ్యర్థాలు వేయడం వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. రొయ్యల గుంతల్లో చికెన్ వ్యర్థాలు వేస్తే గ్రామస్తులు తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం స్వాధీనం చేసుకున్న వాహనాలను బుచ్చిరెడ్డిపాళెం పోలీస్‌స్టేషన్‌కు తరలించగా కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో సచివాలయ సిబ్బంది రంజిత్, అయోధ్య పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



నెల్లూరు(క్రైమ్): గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. సుమారు 50 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి జీజీహెచ్ ప్రాంగణంలోని అంబులెన్స్‌ల పార్కింగ్ ప్రదేశంలో రెండు రోజుల క్రితం మృతి చెందారు. ఈ మేరకు దర్గామిట్ట పోలీసులకు వీఆర్వో అశోక్ ఫిర్యాదు చేశారు. మృతుడు తెలుపు రంగు చొక్కా, బూడిద రంగు ప్యాంట్‌ను ధరించి ఉన్నారు. మృతుడి వద్ద ఎలాంటి వివరాలు లభ్యం కాలేదు. మృతుడి వివరాలు తెలిసిన వారు దర్గామిట్ట పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ సీతారామయ్య కోరారు.

విద్యుత్ భవన్ వద్ద ధర్నా

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించాలనే ఉద్దేశంతో అన్ని రాష్ట్రాలపై కేంద్రం షరతులు విధిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. నగరంలోని విద్యుత్ భవన్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో మహాధర్నాను శుక్రవారం నిర్వహించారు. అనంతరం ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ వెంకటసుబ్బయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, సీపీఐ ఎమ్మెల్ జిల్లా నేత లక్ష్మణ్, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు, నేతలు కత్తి శ్రీనివాసులు, కృష్ణయ్య, రామరాజు, అరిగెల నాగేంద్రసాయి, ఆంజనేయులు, సిరాజ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అధిక ఫీజులను అరికట్టరూ..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యార్థుల నుంచి అధిక ఫీజులను వసూలు చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు చేపట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ నేతలు కోరారు. ఈ మేరకు ఆర్‌ఐఓ శ్రీనివాసరావుకు నగరంలోని ఆయన కార్యాలయంలో వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రాజా మాట్లాడారు. సదరు విద్యాసంస్థలపై తనిఖీలు చేపట్టాలని కోరారు.

కోటి కుంకుమార్చనకు ఆహ్వానం

నెల్లూరు(బృందావనం): జొన్నవాడలోని కామాక్షితాయి దేవస్థానంలో జూలై 19 నుంచి 29 వరకు నిర్వహించనున్న కోటి కుంకుమార్చన మహాయజ్ఞానికి నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్‌ను దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ పుట్టా లక్ష్మీసుబ్రహ్మణ్యంనాయుడు, ధర్మకర్తలు ఆహ్వానించారు. ఈ మేరకు నవాబుపేటలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు.

గడప గడపకు మన ప్రభుత్వానికి బ్రహ్మరథం

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



వాటర్‌క్యాన్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

ఇందుకూరుపేట: 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. సంక్షేమ పథకాలు పక్కాగా అందుతున్నాయని సంతోషంగా చెబుతున్నారు.' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. గడప గడపకు కార్యక్రమాన్ని శుక్రవారం ఇందుకూరుపేటలో నిర్వహించారు. ఇప్పటి వరకు ఎమ్మెల్యే 80,600 గడపలకు వెళ్లి పథకాలు అందాయా? లేదా? అని ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలే తమకు శ్రీరామరక్ష అన్నారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థల ద్వారా సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయన్నారు. తాగునీరు అందించాలన్న ఆలోచనతో బాపట్ల ఎంపీ సురేష్ నిధులు రూ.7 లక్షలతో మండలంలోని రావూరు డొంక కాలనీలో వాటర్ ప్లాంట్‌ను నిర్మించారు. దీనిని ప్రసన్న ప్రారంభించారు.

- ఇటీవల గంగపట్నం, రాముడిపాళెం ఇందుకూరుపేట ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన నలుగురికి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.85 వేలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆ బాండ్లను చిన్నారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేంద్రబాబు, పలు శాఖల అధికారులు, నాయకులు పండ్లపూడి శ్రీనివాసులురెడ్డి, చక్రి, వాసు, రాజా, రవికుమార్ సర్పంచ్ పద్మావతమ్మ పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో ప్రజలకు మేలు

- ట్రెయినీ కలెక్టర్ విద్యాధరి



అర్జీలను పరిశీలిస్తున్న విద్యాధరి

తోటపల్లిగూడూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ట్రెయినీ కలెక్టర్ విద్యాధరి పేర్కొన్నారు. మండలంలోని చిన్నచెరుకూరు, సౌత్ ఆములూరు గ్రామాల్లో శుక్రవారం ఆమె ఆర్డీఓ మలోలతో కలిసి పర్యటించారు. ఆయా గ్రామాల్లో చేపట్టిన సర్వేలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని అధికారులకు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా శనివారం నుంచి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. సాంకేతిక కారణాలతో పరిష్కారానికి నోచుకోని ప్రజా సమస్యలపై దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ఉచితంగా అందించే 11 రకాల సేవలను ప్రజలకు వివరించాలన్నారు. వైఎస్సార్ పెన్షన్ కానుక, రైతు భరోసా, సున్నా వడ్డీ, విద్యా కానుక, విద్యా దీవెన, వసతి దీవెన, చేయూత, అమ్మఒడి, కాపు నేస్తం, వాహనమిత్ర తదితర పథకాలు అర్హులకు తప్పనిసరిగా అందాలన్నారు. ఇంటిగ్రేటెడ్ సర్టిఫికేట్లు, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, జనన, మరణ సర్టిఫికెట్లు, ఆధార్, రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులు తదితర సేవలను అందించనున్నట్లు తెలిపారు. ప్రతి సచివాలయ పరిధిలో ఈనెల ఒకటి నుంచి 27వ తేదీ వరకు జరిగే ఈ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలిసి అధికారులందరూ సమష్టిగా విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హమీద్, ఆర్‌ఐ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళకు ట్రై సైకిల్ వితరణ



ట్రై సైకిల్ అందజేసిన చలపతిరావు, నాయకులు

కొడవలూరు: దివ్యాంగురాలైన మహిళకు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎలక్ట్రిక్ ట్రై సైకిల్ వితరణగా ఇచ్చారు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మండలంలోని గండవరంలో ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆ సమయంలో స్థానిక దివ్యాంగ మహిళ షేక్ కాలేబీ తనకు ట్రై సైకిల్ అందించి ఆదుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఆయన వెంటనే స్పందించి తన తండ్రి పేరుతో ఉన్న ఎన్‌ఎస్‌ఆర్ ట్రస్ట్ ద్వారా అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు ప్రసన్న ఎలక్ట్రిక్ ట్రై సైకిల్‌ను నార్తురాజుపాళేనికి పంపించారు. ఇక్కడి వీసీఆర్ లేఅవుట్‌లో డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు శుక్రవారం కాలేబీకి సైకిల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా ఎమ్మెల్యే అనేకమంది దివ్యాంగులను ఆదుకున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, నాయకులు అడపాల మోహనకృష్ణ, మందపల్లి మల్లికార్జున, రామిరెడ్డి రాజేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి కాకాణి రాక

పొదలకూరు: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండలంలోని బిరదవోలు సచివాలయానికి శనివారం ఉదయం 11 గంటలకు విచ్చేస్తారని ఎంపీడీఓ నగేష్‌కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగనన్న సురక్ష వెరిఫికేషన్లో ఆయన పాల్గొని గ్రామస్తులతో మాట్లాడతారన్నారు. మండల స్థాయి అధికారులు పాల్గొనాలని సూచించారు.

ఇస్కపాళెంలో..

వెంకటాచలం: మంత్రి గోవర్ధన్‌రెడ్డి శనివారం ఇస్కపాళెంలో పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ఇస్కపాళెం సచివాలయానికి చేరుకుని జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారని తెలియజేశారు.

బద్దెవోలు గ్రామానికి..

మనుబోలు: మంత్రి గోవర్ధన్‌రెడ్డి శనివారం మండలంలోని బద్దెవోలు గ్రామంలో ఉదయం 11 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

వీఎస్‌యూ రిజిస్ట్రార్‌కు సన్మానం



వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో శుక్రవారం రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డిని అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆయన రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా శాలువాలతో సత్కరించారు. వర్సిటీ అభివృద్ధికి రిజిస్ట్రార్ చేసిన కృషిని కొనియాడారు.

కవితా సంపుటి ఆవిష్కరణ రేపు

నెల్లూరు(బృందావనం): కవి చిన్ని నారాయణరావు రచించిన దీర్ఘ కవితా సంపుటి దాహం.. దాహం ఆవిష్కరణ, పరిచయ వేదికను పురమందిర ప్రాంగణంలోని ఏసీ హాల్లో ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు నిర్వహించనున్నామని పెన్నా రచయితల సంఘ అధ్యక్షుడు శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను సంఘ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. గోవిందరాజు సుభద్రాదేవి, రాధాకృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

శేషజీవితాన్ని హాయిగా గడపాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్‌లో విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగ విరమణ పొందిన వారు తమ శేష జీవితాన్ని హాయిగా గడపాలని సీఎండీ సంతోష్‌రావు కాంక్షించారు. జిల్లా సర్కిల్‌కు చెందిన 10 మంది ఉద్యోగ విరమణ పొందడంతో వారికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుభాకాంక్షలను తెలియజేశారు. ఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు సుబ్బరాజు, శివప్రసాద్‌రెడ్డి, శశికళ, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి అవసరాలకు రూ. 85 కోట్ల మంజూరు



మాట్లాడుతున్న రజత్‌కుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని 20 వార్డుల్లో ఉన్న ప్రజల తాగునీటి అవసరాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.85 కోట్లు మంజూరైనట్లు వైఎస్సార్‌సీపీ కోవూరు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెంలోని పార్టీ కార్యాలయంలో 7వ వార్డు ప్రజా ప్రతినిధులు, స్థానికులతో ఆయన శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీ ఎన్నికలు ముగిసి సుమారు ఒకటిన్నర సంవత్సరమైందన్నారు. ఇందులో భాగంగా ఆయా వార్డుల్లో ఏ అభివృద్ధి పనులు అవసరమో గుర్తించేందుకు ఈ సమీక్షను నిర్వహించామన్నారు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కృషితో రూ.85 కోట్లు మంజూరు చేశారని, ఈ నిధులతో సంగం బ్యారేజ్ నుంచి పైపులైన్ ద్వారా ప్రతి ఇంటికీ కుళాయిని ఏర్పాటు చేసి మంచినీటిని అందిస్తామన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్‌పర్సన్ కోటంరెడ్డి లలిత, కౌన్సిలర్ షకీలాబేగం, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జునరెడ్డి, నాయకులు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, కోడూరు మధుసూదన్‌రెడ్డి, ఇప్పగుంట విజయభాస్కర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అల్లాభక్షు, బాబు పాల్గొన్నారు.

'దినేష్‌రెడ్డికి విషయ పరిజ్ఞానం లేదు'

- డీసీఎంఎస్ చైర్మన్ చలపతిరావు



సమావేశంలో మాట్లాడుతున్న చలపతిరావు

కొడవలూరు: టీడీపీ నాయకుడు దినేష్‌రెడ్డికి విషయ పరిజ్ఞానం లేదని డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు అన్నారు. మండలంలోని నార్తురాజుపాళెం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొడవలూరు మండలం రాచర్లపాడులోని గమేసా ఫ్యాక్టరీని 2017లో అప్పటి సీఎం చంద్రబాబు ప్రారంభించినట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ 2019లో అధికారంలోకి రాగా 2020లో పరిశ్రమలు స్థాపిస్తే స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు కల్పించాలన్న జీఓను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఈ విషయంపై అవగాహన లేని దినేష్‌రెడ్డి గమేసా ఫ్యాక్టరీ వద్ద సెల్ఫీ తీసుకుని 75 శాతం ఉద్యోగాలు కల్పించలేదంటూ చాలెంజ్ చేయడమేమిటని ప్రశ్నించారు. స్థానికులకు ఎందుకు ఉద్యోగాలు కల్పించలేదన్న విషయాన్ని ఫ్యాక్టరీని ప్రారంభించిన చంద్రబాబు, అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న నీ తండ్రి పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని ప్రశ్నించాలని సూచించారు. విషయ పరిజ్ఞానం లేకుండా ఎవరో చెబితే చౌకబారు సెల్ఫీ చాలెంజ్ చేయడం సిగ్గుచేటన్నారు. మీ సొంతూరు నార్తురాజుపాళెంలో ఎవరు అభివృద్ధి చేశారో సెల్ఫీ చాంలెంజ్‌తో ముందుకు వస్తే నిరూపిస్తామన్నారు. టీడీపీకే గ్యారంటీ లేకపోతే ప్రజల భవిష్యత్తుకు మీరెలా గ్యారంటీ ఇవ్వగలరని ప్రశ్నించారు.

పేదలందరికీ న్యాయం

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు వంద శాతం న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని చలపతిరావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, నాయకులు అడపాల మోహనకృష్ణ, నల్లావుల శ్రీనివాసులు, కొట్టే మల్లికార్జున, చక్కా మనోహర్, దేవనబోయిన శివకుమార్, మారంరెడ్డి రంగారెడ్డి, నాగిరెడ్డి సునీల్‌కుమార్, వేముల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆస్తి పత్రాలను కాజేశారు

నెల్లూరు(క్రైమ్): ఓ వ్యక్తికి చెందిన ఆస్తి పత్రాలను కాజేసిన వారిపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మిలటరీ కాలనీలో నివాసముంటున్న కాంట్రాక్టర్ వెంకటరామానాయుడు వద్ద సమీప బంధువు శ్రీనివాస్ పనిచేస్తూ ఎంతో నమ్మకంగా ఉండేవారు. దీంతో అన్ని పనులను ఆయన శ్రీనివాస్‌కు అప్పజెప్పేవారు. రామానాయుడు, అతని భార్య, కుమార్తె పేర్లపై మాగుంట లేఅవుట్లో స్థిరాస్తి ఉంది. తన అవసరాల నిమిత్తం కుమార్తె పేరుపై ఉన్న ఆస్తిలో కొంత భాగాన్ని ఓ వ్యక్తికి విక్రయించారు. కొనుగోలు చేసిన వ్యక్తి లింక్ డాక్యుమెంట్లను కోరగా, వాటిని శ్రీనివాసులుకు ఇచ్చి వెంకటరామానాయుడు పంపారు. అప్పటి నుంచి వాటిని తిరిగి వెంకటరామానాయుడికి ఇవ్వకుండా శ్రీనివాస్ తప్పించుకొని తిరగసాగారు. దీంతో గత నెల 27న శ్రీనివాస్ ఇంటికెళ్లి డాక్యుమెంట్లను బాధితుడు అడిగారు. రూ.కోటి ఇస్తేనే డాక్యుమెంట్లను అప్పగిస్తానని శ్రీనివాస్, అతని బావ డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి



మాట్లాడుతున్న సత్యవాణి

కోవూరు: అన్నదాతలు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం కో–ఆర్డినేటర్ పి.సత్యవాణి తెలిపారు. గంగవరం, ఇనమడుగు, వేగూరు, కోవూరు ప్రాంతాల రైతులకు కోవూరులో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు సేంద్రియ పద్ధతులు పాటించాలన్నారు. పురుగు మందుల వాడకం తగ్గించి, సహజ మిత్ర పురుగులను కాపాడాలన్నారు. ఎడగారు వరిలో నల్లి మాత్రమే అధిక ఉష్ణోగ్రత వల్ల కనిపిస్తుందన్నారు. దానికి అదే పనిగా మందులు వాడాల్సిన అవసరం లేదన్నారు. బదులుగా సూక్ష్మ పోషకాలైన జింక్, మాంగనీస్, బోరాన్, ఐరన్ వంటివి పిచికారీ చేసుకుంటే అధిక దిగుబడి శక్తి వస్తుందన్నారు. ఎడగారు పూర్తయిన వెంటనే అందరూ పచ్చిరొట్ట పైర్లను సాగు చేయాలన్నారు. భూమి సహజ జీవం కోల్పోకొండా, సూక్ష్మజీవులు సజీవంగా ఉండి పోషకాలను పైరుకు అందిస్తాయన్నారు. కార్యక్రమంలో ఏడీలు శ్రీనివాసులు, లక్ష్మీమాధవి, సుజాత, వ్యవసాయాధికారులు చక్రవర్తి, ఇంద్రావతి, సిబ్బంది మాధవి, సాద్విక, చైతన్య, శిరీష, మెహరున్నీసా, సుభాషిణి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి మృతిపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): వృద్ధుడు మృతి చెందిన ఘటనపై సంతపేట పోలీసులు కేసును శుక్రవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. సంతపేటలోని బొగ్గులవీధికి చెందిన విశ్రాంత మున్సిపల్ ఉద్యోగి పెంచలయ్య (65)కు 19 ఏళ్ల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో అప్పటి నుంచి చికిత్స పొందుతున్నారు. ఈ నెల 11న పెంచలయ్య అనారోగ్యానికి గురవడంతో రామచంద్రారెడ్డి హాస్పిటల్లో చికిత్స పొంది 13న ఇంటికెళ్లారు. 15వ తేదీ తెల్లవారుజామున బాత్‌రూమ్‌లో పడటంతో అపస్మారక స్థితిలోకి వెళ్లారు. దీంతో చికిత్స నిమిత్తం నారాయణ హాస్పిటల్‌కు కుటుంబసభ్యులు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం చెన్నైలోని స్టాన్లీ హాస్పిటల్లో చేర్పించగా, అక్కడ చికిత్స పొందుతూ పెంచలయ్య గురువారం మృతి చెందారు. ఈ మేరకు సంతపేట పోలీసులకు మృతుడి భార్య రాజేశ్వరి ఫిర్యాదు చేశారు. ఎస్సై వేణుగోపాల్ దర్యాప్తు చేస్తున్నారు.

'జగనన్న సురక్ష' విజయవంతానికి పిలుపు



మనుబోలు: మాట్లాడుతున్న ఎంపీడీఓ



కోడూరులో వివరాలు తెలుసుకుంటున్న నాయకులు

మనుబోలు: మండలంలోని నేటి నుంచి జరగనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్షతో జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకే వెళ్లి అందజేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఏఓ రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, ముంగర రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- ముత్తుకూరు: జగనన్న సురక్ష కార్యక్రమం శనివారం నారికేళ్లపల్లి సచివాలయంలో ఎంపీడీఓ ప్రత్యూష, మల్లూరు సచివాలయంలో తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరుగుతుంది. 4వ తేదీన పొట్టెంపాడులో ఎంపీడీఓ, పిడతాపోలూరులో తహసీల్దార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. 6వ తేదీన నేలటూరులో ఎంపీడీఓ, వల్లూరులో తహసీల్దార్‌లు పర్యవేక్షిస్తారు. 11న బ్రహ్మదేవి–1లో ఎంపీడీఓ, బ్రహ్మదేవి–2లో తహసీల్దార్ పర్యవేక్షణలో జరుగుతుంది. 13న ఎంపీపాళెం, పంటపాళెం, 15న ముత్తుకూరు–1, 18న ముత్తుకూరు–2, 20వ తేదీన కృష్ణపట్నం, 22న దొరువులపాళెం, 25న ముత్తుకూరు–3, 27వ తేదీన తాళ్లపూడిలో ఈ కార్యక్రమం జరుగుతుంది.
- తోటపల్లిగూడూరు: జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతానికి అధికారులందరూ కృషి చేయాలని జగనన్న సచివాలయ కమిటీ (జేసీఎస్) మండల కన్వీనర్ తలమంచి సురేంద్రబాబు విజ్ఞప్తి చేశారు. మండలంలోని కోడూరు పంచాయతీలో శుక్రవారం జరిగిన జగనన్న సురక్ష సర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సురేంద్రబాబు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఈనెల 27వ తేదీ వరకు మండలంలోని అన్ని సచివాలయాల్లో జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కావల్‌రెడ్డి రంగారెడ్డి, కోడూరు దిలీప్‌రెడ్డి, దువ్వూరు శ్రీనివాసులురెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని బస్సుల సీజ్‌కు వినతి

నెల్లూరు (టౌన్): ఫిట్‌నెస్ లేకుండా తిరుగుతున్న విద్యాసంస్థల బస్సులను సీజ్ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు నగరంలోని రవాణా శాఖ కార్యాలయంలో డీటీసీ చందర్, ఇన్‌చార్జి ఆర్టీఓ మురళీమోహన్‌కు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడారు. బస్సుల్లో పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్నారని ఆరోపించారు.

వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఉద్యోగ విరమణ

నెల్లూరు(బారకాసు): ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ మురళీకృష్ణ ఉద్యోగ విరమణ పొందారు. ఈ క్రమంలో ఆయన్ను యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం సత్కరించారు. జనరల్ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గంగాధర్, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, సందానీబాషా, తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

నెల్లూరు(బృందావనం): తమ ఏడాది పదవీ కాలంలో జిల్లాలో 60 సేవా, సంక్షేమ కార్యక్రమాల ద్వారా సుమారు నాలుగు వేల మందికి లబ్ధి చేకూర్చామని రోటరీ క్లబ్ నెల్లూరు అధ్యక్షుడు కొండా శేఖర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి ఉదయభాస్కర్‌రావు పేర్కొన్నారు. ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని క్లబ్ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు.

'జగనన్న సురక్ష'పై ప్రత్యేక దృష్టి

నెల్లూరు(బారకాసు): జగనన్న సురక్ష కార్యక్రమ అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. ఒకటో డివిజన్లోని కల్లీ కాలనీ సమీపంలో శనివారం నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమ ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. జగనన్న సురక్ష పథకం అందరికీ చేరువయ్యేలా సచివాలయ సెక్రటరీలు కృషి చేయాలని సూచించారు. అనంతరం 13 / 2, 1 / 2 బాలాజీనగర్, కల్లీ కాలనీలోని వార్డు సచివాలయాలను పరిశీలించారు. అనంతరం చిల్డ్రన్స్‌పార్కు సమీపంలో స్పందన ఫిర్యాదును టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు.

హోంగార్డులకు ఘనంగా వీడ్కోలు

నెల్లూరు(క్రైమ్): పెళ్లకూరు, వెంకటగిరి పోలీస్‌స్టేషన్లలో హోంగార్డులుగా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఈశ్వరయ్య, పుల్లయ్యకు పోలీస్ అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వీరిని ఏఎస్పీ హిమవతి సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. శేషజీవితాన్ని కుటుంబంతో హాయిగా గడపాలని కాంక్షించారు. ప్రభుత్వం నుంచి అన్ని బెనిఫిట్స్‌ను సకాలంలో అందేలా చూస్తామన్నారు. డీపీఓ ఏఓ విజయ్‌కుమార్, హోంగార్డ్స్ డీఎస్పీ చంద్రమోహన్, ఆర్‌ఐ పాల్‌రాజు, పీ సెక్షన్ సూపరింటెండెంట్ షిరియా, జూనియర్ అసిస్టెంట్ అంజనీకుమార్ పాల్గొన్నారు.